# కాలే కడుపులు.. మండే బతుకులు

- ఉపాధి పనులు చూపని అధికారులు
- పస్తులుండాల్సిన దుస్థితిలో కూలీలు
- చేసిన పనులకూ అందని కూలి
- పట్టించుకోని అధికార యంత్రాంగం


కరప మండలం కొరిపల్లి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


పనులు కల్పించాలని, బకాయిలు చెల్లించాలని కరపలో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

**కరప:** పనుల కోసం కూలీలు గ్రామాలు ఖాళీ చేసి, వలస వెళ్లకుండా, ఉన్న ఊళ్లలోనే ఉపాధి కల్పించే బృహత్తర కార్యక్రమమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం. గ్రామాల్లో అవసరమైన మేరకు పనులు కల్పించి కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఖాతాలకు సకాలంలో కూలి జమ చేయడం అధికారుల ప్రాథమిక కర్తవ్యం. తద్వారా కూలీల జీవనోపాధికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేయడమే పథకం ముఖ్యోద్దేశం. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్నిచోట్ల కూలీలకు పనుల్లేక, కూలి అందక పస్తులుండాల్సిన దుస్థితి ఎదురవుతోంది.

పనులు చూపించాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో పస్తులుంటున్నామని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి వంద రోజుల పని దినాలు కల్పిస్తామంటున్న మాట దేవుడెరుగు.. నాలుగైదు వారాలు కూడా పని చెప్పడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు. అటు వ్యవసాయ పనుల్లేక, ఇటు ఉపాధి పనులు దొరక్క నానా అవస్థలు పడుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కూలీలు మండిపడుతున్నారు. చేసిన అరకొర పనులకూ వేతనాలు చెల్లించలేదని, రెండు నెలలుగా అప్పులు చేసి కడుపు నింపుకోవాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పరిస్థితి దయనీయం**

గురజనాపల్లి, పాతర్లగడ్డ, కొంగోడు, వేములవాడ తదితర గ్రామాల్లో గ్రూపులకు పనులు చెబుతున్న అధికారులు తమను ఎందుకు పట్టించుకోవడం లేదని గొర్రిపూడికి చెందిన ఉపాధి కూలీలు నిలదీస్తున్నారు. కరప మండలంలోని గొర్రిపూడి గ్రామంలో ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా తయారైంది. పనులు చూపించి తమను ఆదుకోవాలంటూ ఎన్ని వినతిపత్రాలు ఇస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో 260 మందికి జాబ్‌కార్డులుండగా, ఎక్కువగా 190 మంది పనులకు వస్తుంటారు. గతంలో వీరు ఆకుతీతలు, ఊడ్పులు, కోతలు, కుప్పనూర్పులు వంటి వ్యవసాయ పనులు చేసేవారు. ఇప్పుడు రైతులు యంత్ర పరికరాలతో పనులు చేసుకుంటున్నారు. దీంతో అటు వ్యవసాయ పనులు, ఇటు ఉపాధి పనులు లేకపోవడంతో కడుపు నింపుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. అప్పు పుట్టకపోతే పస్తులుండాల్సి వస్తోందని ఉపాధి కూలీలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉపాధి పథకం సిబ్బందిని అడిగితే, పనులు గుర్తించి, ప్రతిపాదనలు పంపామని, మంజూరు కాగానే పనులు చెబుతామంటున్నారని పేర్కొన్నారు. నెల రోజులైనా ఒక్కరోజు పని కూడా చెప్పలేదని ఉపాధి కూలీలు ఆరోపించారు.

**బకాయిలూ చెల్లించ లేదు**

మండలంలోని 23 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు చేయించారు. పనులు చేసి 4 నుంచి 7 వారాలైనా వేతనాలు చెల్లించ లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. మూడు వారాల్లోనే ఉపాధి వేతనాలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు అంటున్నారే కానీ, ఆచరణలో కానరావడం లేదని కూలీలు మండిపడుతున్నారు. కూలి చెల్లించకుండా కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు సమాన స్థాయిలో ఉపాధి పనులు కల్పించాలని, కూలి సొమ్ము సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. మండలంలో కొన్ని గ్రామాల వారికి పనులు చెప్పడం లేదని, మరికొన్ని గ్రామాల్లో చేసిన పనులకు వేతనాలు చెల్లించడం లేదని ఉపాధి కూలీల ఆరోపణలపై ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జీవీ రమణకు మార్ ఇచ్చిన వివరణ ఇలా ఉంది.

**ఉత్తర్వులు రాగానే పనులు చేయిస్తాం**

"మండలంలో చాలా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. గొర్రిపూడి, కరప తదితర గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించి, 70 పనులకు ప్రతిపాదనలు పంపించాం. ఎన్నికలు జరగడం, కలెక్టర్లు మారడం వంటి కారణాలతో పనుల మంజూరు ఆలస్యమైంది. మంజూరు ఉత్తర్వులు రాగానే పనులు చేయిస్తాం. నాలుగైదు వారాలకు వేతనాలు చెల్లించాల్సి ఉంది, ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. నిధులు మంజూరు కాగానే ఉపాధి కూలీల ఖాతాలకు జమ చేస్తాం.

– జీవీ రమణకుమార్, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, కరప మండలం

**ఖాళీగా ఉంటున్నాం**



ఉపాధి పనులు చెప్పక నెల రోజులుగా ఖాళీగా ఉంటున్నాం. దాళ్వా కోతలకు మెషీన్లు ఉపయోగించడం వల్ల ఈ ఏడాది వ్యవసాయ పనులు కూడా చేయలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతుంటే, గొర్రిపూడిలో ఒక్క పనీ జరగడం లేదు. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పొట్లకాయల కృష్ణ, ఉపాధి కూలీ, గొర్రిపూడి

**కూలి చెల్లించడం లేదు**



ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్నా, కూలి బకాయిలు చెల్లించక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడు వారాల పాటు ఉపాధి పనులు చేశాను. రెండు నెలలు అవుతున్నా కూలి సొమ్ము చెల్లించలేదు, బ్యాంక్‌లు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కూలి జమ చేసేలా చర్యలు తీసుకోవాలి."

– చోడిశెట్టి కృష్ణ, ఉపాధి కూలీ, వాకాడ

# తెలుగు ఖ్యాతిని ఇనుమడించిన ఎస్వీఆర్

- జయంతి వేడుకలో వైఎస్సార్ సీపీ నేత కురసాల
- కాకినాడలో ఘనంగా జయంతి వేడుకలు


కాకినాడ నాగమల్లి జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు జయంతి వేడుకల్లో పాల్గొన్న కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీపీ బందిలి విరీష తదితరులు


ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ రూరల్:** తెలుగు చిత్ర సీమకు ఆదర్శనీయుడు ఎస్వీ రంగారావు అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి జంక్షన్ వద్ద ఎస్వీఆర్ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ బుధవారం ఘనంగా నిర్వహించింది. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ బందిలి విరీష, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, పుల్ల కోటేశ్వరరావు, కరీం బాష, తోటకూర శ్రీను తదితరులు ఎస్వీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి సందడి చేశారు. ఎస్వీఆర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్వీఆర్ తెలుగు చిత్ర సీమ ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. ఏ పాత్రలోనైనా లీనమై నటించే సహజ నటుడు ఎస్వీఆర్ ఆంధ్రరాష్ట్రంలో పుట్టడం గర్వకారణమన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీపీ విరీష మాట్లాడుతూ ఎస్వీ రంగారావు నటనను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు జమ్మలమడక నాగమణి, ఉమేష్, వాసిరెడ్డి సూరిబాబు, కడియాల చిన్నా, విత్తనాల నాగేశ్వరరావు, కొవ్వూరు సర్పంచ్ పిల్లి చక్రరావు, ఊబా శ్రీను, సూరాడ రాజు, సత్యనారాయణ, సింహాద్రి, భువనేశ్వరి, వెంకటలక్ష్మి, నల్లా రాణి తదితరులు పాల్గొన్నారు.

**అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఎస్వీఆర్ చిత్రపటానికి అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, ఓం నమశ్శివాయ, చంద్రరావు, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్వీ రంగారావు దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ తదితర భాషల్లో 300కి పైగా చిత్రాల్లో నటించారన్నారు. నర్తనశాలలో ఆయన పాత్రకు భారత రాష్ట్రపతి పురస్కారమే కాక, ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్ బహుమతిని కూడా ఆయన అందుకున్నారన్నారు.

**ఎస్వీఆర్‌కు ఎమ్మెల్యే నివాళులు**

విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతి వేడుకలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. స్థానిక నాగమల్లి జంక్షన్ వద్ద ఎస్వీఆర్ కాంస్య విగ్రహానికి ఆయన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి గర్వపడేలా ఎస్వీ రంగారావు నటనతో ఆకట్టుకున్నారన్నారు. ఎస్వీఆర్ చిత్ర రంగానికి ఆదర్శనీయుడన్నారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలో సినీ నటుడు రావు గోపాలరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## సమస్యలపై ఉపాధి కూలీల ధర్నా


ఎంపీడీఓ అప్పారావుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి కూలీలు

**కరప:** మండలంలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి కూలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రిపూడి గ్రామంలో పనుల్లేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసిన పనులకు వేతనాలు చెల్లించక పోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం ఉపాధి కూలీలు తమ వినతిపత్రాన్ని ఎంపీడీఓ కె.అప్పారావుకు అందజేశారు. ఎంపీడీఓ అప్పారావు స్పందించి ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్లు కేజే ప్రకాష్, టి.రాజేంద్ర, గొర్రిపూడి ఫీల్డ్ అసిస్టెంట్ సీహెచ్ వెంకటరమణను పిలిపించి, ఉపాధి కూలీలతో మాట్లాడించారు. గొర్రిపూడిలో మంజూరైన పనులు పూర్తయ్యాయని, కొత్త పనులకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే పనులు కల్పిస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని ఉపాధి కూలీలకు వివరించారు.

## రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

**బోట్‌క్లబ్:** పార్లమెంట్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మజ అన్నారు. బుధవారం స్థానిక సర్పవరం జంక్షన్‌లో బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు.

## ఆలయ హుండీల లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

**బోట్‌క్లబ్:** జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను బుధవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. మూడు నెలల వ్యవధికి రూ.8.89 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఎస్.సత్యవాణి తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, భక్తసమాజం సభ్యులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి సైకిల్ అందజేత


విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న సంస్థ సభ్యులు

**బోట్‌క్లబ్:** వాసవీ వైశ్య ఫ్రెండ్స్ కన్వీనర్ చెక్క రమేష్ ఆధ్వర్యంలో పేద విద్యార్థి మేధా శ్లోకకు బుధవారం సైకిల్ అందజేశారు. ప్రస్తుతం ఆమె ఇంటర్మీడియెట్ చదువుతోంది. నిత్యం కాలేజీకి వెళ్లడానికి ఆమె ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య ఫ్రెండ్స్ చొరవతో పైడా వెంకటనారాయణ, గ్రంధి గణేష్, ఇతర దాతల సహకారంతో ఆమెకు సైకిల్ సమకూర్చారు. కార్యక్రమంలో సభ్యులు అప్పన అమర్నాథ్, కూరపాటి సూరిబాబు, బలభద్రుని రమేష్, బందరు మిఠాయి నెహ్రూ, కంచర్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# విద్యే ప్రగతికి మూలం


గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులకు పట్టాలు అందజేసిన అధికారులు

**కరప:** ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యే ప్రగతికి మూలమన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్లు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలోకి కాకుండా బడికి పంపాలన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును వివరించారు. ఎంఈఓ కె.బులికృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు విద్యనందించడమే కాకుండా, ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, చిన్నారులకు పట్టాలు అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమం అధ్యక్షుడిగా కృష్ణప్రకాష్


అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణప్రకాష్‌ను అభినందిస్తున్న సభ్యులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట పంచాయతీలోని రాయుడుపాలెం వద్ద ఉన్న రోటరీ క్లబ్ ఆశ్రయ ఓల్డ్ ఏజ్ హోమ్ అధ్యక్షుడిగా న్యాయవాది, పూర్వపు కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. రోటరీ ఆశ్రయ అధ్యక్షుడిగా పనిచేసిన ధన సాగర్‌ప్రసాద్ నుంచి బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, బోర్డు సభ్యులుగా బాలకృష్ణ, వర్మ, ప్రసాద్, శేషగిరిరావు, వీర్రాజు, నాగేశ్వరరావు, ఆదిత్య, సత్యపాల్, ఉషారాణి, పద్మజావాణి బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రకాష్ మాట్లాడుతూ అందరి సహకారంతో వృద్ధాశ్రమంలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. వృద్ధాశ్రమంలో అన్నపూర్ణ పథకానికి సంజీవ్ ప్రకాష్, దివేనంద్, వీర్రాజు రూ.30 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో కాకినాడ రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు శిష్టల శ్రీకాంత్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తుమ్మలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు


మెక్లారిన్ గ్రౌండ్‌లో వేడుకలకు హాజరైన క్రైస్తవులు


సమావేశంలో పాల్గొన్న సీవైఎఫ్ ఇంటర్నేషన్ డైరెక్టర్ మూర్తిరాజు తదితరులు

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** హౌస్ ఆఫ్ ప్రేయర్, క్రాంతి టీవీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్‌లో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఏపీసీ జిల్లా అధ్యక్షుడు రిక్కీగూటం, హౌస్ ఆఫ్ ప్రేయర్ పాస్టర్ పి.విజయ్‌కుమార్, మోజెస్ వెస్లీ, ప్రశాంత్, జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డి.శామ్యూల్ సాగర్, ఏపీసీ ప్రతినిధులు స్టీఫెన్ ఆనంద్, టీజీ సుధీర్, కాకినాడ రూరల్ పాస్టర్ల అధ్యక్షుడు శీరం ఐజాక్, మిస్సా విజయ్‌కుమార్ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రిక్కీగూటం మాట్లాడుతూ క్రైస్తవ విద్యా, వైద్య సంస్థలు దేశంలో అభివృద్ధి చెందడం ద్వారా ఎందరికో ఆయా సదుపాయాలు ఉచితంగా అందుతున్నాయన్నారు. విజయవాడ క్రైస్ట్ టెంపుల్ చర్చి పాస్టర్ డాక్టర్ పాల్ ఇమ్మానుయేలు ప్రత్యేక సందేశమిచ్చారు.

**రమణయ్యపేటలో..**

**కాకినాడ రూరల్:** క్రైస్తవ దినోత్సవ వేడుకలు స్థానిక రమణయ్యపేటలో సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవ. మూర్తిరాజు అధ్యక్షతన సంస్థ కోర్ కమిటీ సమావేశంలో జరిగాయి. మూర్తిరాజు మాట్లాడుతూ ప్రేమకు ప్రతి రూపం క్రీస్తు త్యాగమన్నారు. క్రీస్తు ప్రేమ సందేశం సెయింట్ థామస్ భారత దేశానికి తీసుకువచ్చారన్నారు. అక్టోబర్‌లో కాకినాడలో అంతర్జాతీయ యువజన మహోత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీకే సింగ్, జిల్లా అధ్యక్షుడిగా మాసా సన్నీ సుధీర్‌ను ఎన్నికున్నారు. కార్యక్రమంలో సీవైఎఫ్ నేషనల్ సెక్రటరీ జాన్ విక్లిఫ్, స్టేట్ కో–ఆర్డినేటర్ దూదిపాల్ శ్రీనివాస్, కోశాధికారి విజయ్‌భాస్కర్, కోర్ కమిటీ సభ్యులు వారా వినోద్, రాజాల ప్రవీణ్, పెయ్యల నాని, మచ్చా బుజ్జిబాబు, వల్లూరి నానాజీ, కీర్తి విక్టోరియా, ఐశ్వర్య, నిఖిల్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సు సీజ్

**కాకినాడ సిటీ:** రోడ్డు టాక్స్, పర్మిట్ లేకుండా పిఠాపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ బస్సును రోడ్డు రవాణా శాఖాధికారులు బుధవారం రాత్రి సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న బస్సుపై కేసు నమోదు చేశారు. పర్మిట్, రోడ్ టాక్స్ లేకుండా నడుపుతున్నట్టు నిర్ధారించిన అధికారులు రూ.2,88,500 జరిమానా విధించారు. సీజ్ చేసిన వాహనాన్ని కాకినాడ ఆర్టీసీ డిపోకు తరలించారు. వాహనాన్ని కత్తిపూడి ఎంవీఐ బి శ్రీనివాస్ తనిఖీ చేశారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు


అతిసార వ్యాధిపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ తదితరులు

**కాకినాడ సిటీ:** ప్రజారోగ్య పరిరక్షణ, సమస్యల పరిష్కారంలో రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీల పాత్ర కీలకమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధిపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డెంగీ, అతిసార వంటి వ్యాధుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు కరపత్రాలు, పోస్టర్లను కాలనీ అసోసియేషన్లకు నగరపాలక సంస్థ సమకూరుస్తుందని చెప్పారు. గతంలో లాగే ప్రతి నెలా కాలనీ అసోసియేషన్ల సమావేశాలను నిర్వహించి, స్థానిక సమస్యలను నగరపాలక సంస్థ దృష్టికి తేవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో 24 గంటలూ పని చేసేలా టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990 ఏర్పాటు చేస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరీల్, ఈఈ మాధవి, ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ అసోసియేషన్ల గౌరవాధ్యక్షుడు వైడీ రామారావు, వివిధ పార్కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెస్ టోర్నీలో తేజ కార్తికేయ ప్రతిభ


తేజ కార్తికేయకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** రాష్ట్ర స్థాయి చదరంగ పోటీల్లో కాకినాడకు చెందిన ఎం.తేజకార్తికేయ ప్రతిభను కనబరిచాడు. రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఈ పోటీల్లో అండర్–10 విభాగంలో తేజ కార్తికేయ ద్వితీయ స్థానం పొందాడు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు అతడికి కప్ అందించారు. స్థానిక రామారావుపేటలోని నారాయణ స్కూల్‌లో తేజ కార్తికేయ ఐదో తరగతి చదువుతున్నాడు. అతడిని స్టేట్ కో–ఆర్డినేటర్ అర్చన, ప్రిన్సిపాల్ ఎస్.షర్మిల, వైస్ ప్రిన్సిపాల్ శిరీష అభినందించారు.

## క్లుప్తంగా

### ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి ముప్పు


క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

**బోట్‌క్లబ్:** పర్యావరణానికి ప్లాస్టిక్ సంచుల వాడకం ప్రమాదకరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో బుధవారం ప్రజలకు క్లాత్ సంచులు అందించారు. ప్లాస్టిక్ కాలుష్య సమస్యపై అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ప్లాస్టిక్ వల్ల భూ సంబంధ, సముద్ర జాతులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సముద్ర జీవావరణ వ్యవస్థ ప్లాస్టిక్ కాలుష్యం వల్ల తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నాగేంద్ర, సిరాజ్, పద్మావతి, శ్రీవల్లి, కార్తీక్, దీప్తి, భవాని పాల్గొన్నారు.

### నేడు అల్లూరి జయంతి

**కాకినాడ సిటీ:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమం ఈ నెల 4న ఉదయం 9.30కు స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్దనున్న అల్లూరి విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

### గ్రేడ్‌–1 కార్యదర్శిగా పదోన్నతి


ఎస్‌కే నాగేంద్రకుమార్

**కరప:** గురజనాపల్లి, కరప గ్రామాల గ్రేడ్‌–2 పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్‌కు గ్రేడ్‌–1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రాగా, బుధవారం ఎంపీడీఓ కె.అప్పారావు ఆయనను రిలీవ్ చేశారు. గురజనాపల్లి పంచాయతీ కార్యదర్శిగా జి.దుర్గాభవానికి, కరప కార్యదర్శిగా కె.కేశవరావుకు బాధ్యతలు అప్పగించారు. నాగేంద్రకుమార్‌కు పదోన్నతి లభించడంతో కరప మండలం నుంచి బదిలీ కాగా, పెదపూడి మండలం జి.మామిడాడ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

### ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి


గ్రీన్ ఇండియా మిషన్ పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

**బాలాజీచెరువు:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ అన్నారు. స్మార్ట్ లివింగ్ పోగ్రాంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రీన్ ఇండియా మిషన్ 25 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం కాకినాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం సురేష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మొక్కలు పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ సుల్తానా, కో–ఆర్డినేటర్ జనార్దన్, నవీన్, ఇన్‌చార్జి రామారావు, ఏఓ నాయుడు పాల్గొన్నారు.

**49వ డివిజన్‌లో..**

**కాకినాడ రూరల్:** డాక్టరు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా స్థానిక 49వ డివిజన్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కవికొండల భీమశంకర్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నాయకులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని కోరారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

**కాకినాడ సిటీ:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్ల సంఘ నాయకులు బుధవారం డీఈఓ పి.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి, అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థను సరైన దారిలోకి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రతి ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండేలా నిబంధనలు అమలు పర్చాలన్నారు. ఎంటీఎస్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులర్ చేయాలని, 2003 డీఎస్సీ, ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు నిబంధనలను అనుసరించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు బొజ్జా శరత్, జిల్లా కార్యదర్శి కొల్లి రమేష్ ఉన్నారు.